కొత్తపేటలో ముకుంద జ్యువెలర్స్ బ్రాంచ్ ప్రారంభం


ప్రారంభిస్తున్న సంస్థ ఎండీ నరసింహారెడ్డి తదితరులు

నాగోలు: కొత్తపేట చౌరస్తా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ముకుంద జ్యువెలర్స్ నూతన బ్రాంచ్‌ను బుధవారం సంస్థ ఎండీ నరసింహారెడ్డి, సీఈఓ నిఖితారెడ్డి, మేనేజింగ్ పార్టనర్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మొట్టమొదటి జ్యువెలరీ ఫ్యాక్టరీ ఔట్‌లెట్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఎంత బంగారం కొంటే అంత వెండి ఉచితంగా ఇస్తామని, మేకింగ్ చార్జీలు లేవని తెలిపారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జంటకు ఉచిత వివాహం

మలక్‌పేట: నిరుపేదలను చేరదీసి వారికి చేయూతను అందిస్తూ జిగిని ఫర్నిచర్ నిర్వాహకులు ఆదర్శంగా నిలుస్తున్నారని మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం మలక్‌పేటలోని ఫిన్ బధిరుల పాఠశాల ఆవరణలో దివ్యాంగులైన మహాలక్ష్మి, శివ కుమార్ జంటకు జిగిని ఫర్నిచర్ నిర్వాహకులు జిగిని శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం జరిపించారు. అనంతరం శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, నిరుపేదలకు తనవంతు సహకారాన్ని అందించే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. హిందూ సాంప్రదాయం ప్రకారం వేద బ్రాహ్మణులలో పుస్తె మెట్టెలను, పట్టు వస్త్రాలను ఉచితంగా అందించి దివ్యాంగుల జంటకు అంగరంగ వైభవంగా


నూతన వధూవరులను అభినందిస్తున్న జిగిని ఫర్నిచర్ నిర్వాహకుడు శ్రీనివాస్‌గుప్తా

వివాహం జరిపించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, ఎడవెల్లి బాలరాజుగుప్తా, పెద్ది శ్రీనివాస్ గుప్తా, జగిని విజయ్ గుప్తా, వూర రమేష్‌గుప్తా, నాంపల్లి శ్రీనివాస్ గుప్తా, పద్మ నారాయణ గుప్తా పాల్గొన్నారు.

సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డును స్థాపించాలి


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికుల కుటుంబ సభ్యులు, స్థానికులు

హుడాకాంప్లెక్స్: సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) వెల్ఫేర్ బోర్డును స్థాపించి అమర జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి కోరారు. పుల్వామా ఉగ్రదాడిలో వీర మరణం పొందిన జవాన్లకు బుధవారం సాయంత్రం నివాళులర్పించారు. అనంతరం సరూర్‌నగర్ స్టేడియం నుంచి కొత్తపేట చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో 15 వేల సర్వీస్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రాల వారీగా బోర్డులను ఏర్పాటు చేసి సైనికుల కుటుంబాలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని 2012లో కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి సైనికులకు కల్పించే అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు సీబీ రామకృష్ణ, ఎస్ఎన్ రెడ్డి, వి.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సేవాలాల్ జయంతి వేడుకలు

సైదాబాద్: గిరిజన తండాలలో పాటించే సాంప్రదాయాలను పట్టణాల్లోనూ ఆచరిస్తామని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ తెలిపారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే గురువారం సింగరేణి కాలనీ రోడ్‌నెం-14లోని మైదానంలో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకల్లో గిరిజనశాఖ కార్యదర్శి ఐపీఎస్ అధికారి అడావత్ శరత్, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ ధరావత్ జానకి, వనపర్తి అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజా, సైదాబాద్ ఏసీపీ ధరావత్ వెంకన్న నాయక్, డాక్టర్ రాజన్న లను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించామని తెలిపారు. సమావేశంలో సంఘం మహిళా అధ్యక్షురాలు సక్రిబాయి పాల్గొన్నారు.

హయత్‌నగర్ తహసీల్దార్‌గా జానకి



హయత్‌నగర్: హయత్‌నగర్ మండల తహసీల్దార్‌గా కె.జానకి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న బదిలీల్లో భాగంగా కొత్తూరు తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన సునీత బదిలీపై ఇబ్రహీంపట్నం మండలానికి వెళ్లినట్లు తెలిసింది.

శుభోదయ కాలనీ నూతన కమిటీ ఎన్నిక


నూతన అధ్యక్షుడు బద్దం వెంకట్‌రెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని శుభోదయకాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.మల్లేషం, అధ్యక్షుడిగా బద్దం వెంకట్‌రెడ్డి, కార్యదర్శిగా వి.కృష్ణ, కోశాధికారిగా గుండపనేని రాజేశ్వర్‌రావును ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 15, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 19, దొండ 43, ఆలు 21, ఉల్లి 19, గోకర 40, దోస 19, సొర 09, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 45, అర్వి 55, మునగ 55, చిలగడదుంప 58, బీట్‌రూట్ 18, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 60. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పౌష్టికాహారం.. మూణ్నాళ్ల ముచ్చటే!

మూడు నెలలుగా సర్కార్ స్కూళ్లలో పౌష్టికాహారం బంద్



చాదర్‌ఘాట్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. కరువైంది. గతంలో ప్రతిరోజూ ఉప్మాతో వారానికి రెండుసార్లు కోడిగుడ్లు, రాగి జావ, అంబలితో పాటు చిక్కీలు, అరటిపండ్లు అందించిన అధికారులు ప్రస్తుతం కడుపు మాడుస్తున్నారు. మూడు నెలలుగా మలక్‌పేట నియోజకవర్గంలో ఎంపిక చేసిన మూడు పాఠశాలకూ పౌష్టికాహారం సరఫరా కావడం లేదు.

- బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు పెద్దసంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గతంలో మధ్యాహ్న భోజనం పెట్టేవారు.
- విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం పౌష్టికాహారం ప్రవేశపెట్టింది. ప్రస్తుతం మూడు నెలలుగా ఈ కార్యక్రమం బంద్ చేశారు.
- పౌష్టికాహారం పంపిణీ చేసే సంస్థకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆయా కాంట్రాక్టర్లు చేతులెత్తేసినట్లు సమాచారం.

ముందుకు సాగని పథకం...

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చాలా మంది విద్యార్థులు పాఠశాలలకు ఖాళీ కడుపుతో వస్తున్నట్లు గత ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలోనే విద్యార్థులకు స్కూల్‌లోనే బ్రేక్‌ఫాస్ట్ అందించేలా ప్రణాళికలు రూపొందించింది. తొలిదశలో మలక్‌పేట నుంచి మూడు పాఠశాలలు ఎంపికయ్యాయి. నియోజకవర్గంలో దాదాపు 45 పాఠశాలలు ఉన్నాయి. వీటికి పథకం వర్తింపు లేకపోవడంతో విద్యార్థులు పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మృతితో విషాదఛాయలు

సైదాబాద్: ఎల్‌బీనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సాదిక్ అలీ మృతి చెందటంతో ఆయన నివాసంతో పాటు కార్యాలయం ఉన్న మలక్‌పేట బీ-బ్లాక్ క్వార్టర్స్‌లో విషాద ఛాయలు నెలకొన్నాయి. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఘటన గురించి తెలుసుకున్న ఎక్సైజ్‌శాఖ సిబ్బంది, ఆయన సన్నిహితులు బుధవారం ఉదయం బీ-బ్లాక్ క్వార్టర్స్ వద్దకు చేరుకున్నారు. క్వార్టర్స్‌లో నూతనంగా నిర్మించిన గృహ సముదాయంలో ఇన్‌స్పెక్టర్ సాదిక్ అలీ నివసిస్తున్నారు. ఇంటికి దగ్గరలోనే ఉన్న చార్మినార్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఇన్‌స్పెక్టర్ మృతి విషయం తెలిసి వచ్చిన వారు ఆయనతో తమ సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకొని ఆవేదన వ్యక్తం చేశారు. సాదిక్ ఆలీ మంగళవారం తమ కార్యాలయంలో విధులకు హాజరయ్యారని సిబ్బంది తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయ్యాక తమ స్వస్థలం నకిరేకల్‌లో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.


బీ-బ్లాక్ క్వార్టర్స్‌లోని ఎక్సైజ్ పీఎస్ వద్దకు చేరుకున్న సిబ్బంది, సన్నిహితులు

నత్తనడక పనులతో నానా అవస్థలు


ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో నత్తనడకన నడుస్తున్న బాక్స్ డ్రైనేజీ పనులు


నాగేశ్వర్‌రావు కాలనీలో రోడ్డుపై వదిలేసిన మట్టి

- కొత్తపేట డివిజన్‌లో కొన 'సా..గుతున్న' బాక్స్ డ్రైనేజీ పనులు
- రోడ్లపై మట్టి, దుమ్ము ధూళితో రాకపోకలకు ఇక్కట్లు

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని గాయత్రిపురం, నాగేశ్వర్‌రావు కాలనీ, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీలో నిర్మిస్తున్న బాక్స్ డ్రైనేజీ పనులు నత్తనడక నడుస్తున్నాయి. పై కాలనీల నుంచి వచ్చే వరద నీరు పోవడానికి దాదాపు రెండేళ్ల క్రితం కొత్తపేట గాయత్రిపురం నుంచి మూసీ వరకు బాక్స్ డ్రైనేజీ పనులు చేపట్టారు. కాంట్రాక్టర్లు పనులు చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో ఏళ్ల తరబడి పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

- గత వర్షా కాల సమయంలో బాక్స్ డ్రైనేజీ నిర్మాణం కోసం తీసిన గుంతల్లో పడి పలువురు గాయపడ్డారు. డ్రైనేజీ నిర్మిస్తున్న రహదారి వివిధ కాలనీకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో కాలనీవాసులు, వాహన దారులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- గత కొంత కాలంగా బాక్స్ డ్రైనేజ్ పనులు జరగడం లేదు. మధ్యలోనే పనులు నిలిపివేశారు. దీంతో రహదారి సరిగ్గా లేకపోవడం ,గుంతలు తవ్వగా వచ్చిన మట్టిని రోడ్డుపైనే వదిలేయడంతో దుమ్ము ధూళి, మట్టితో రోడ్డు నిండిపోయింది.
- దీంతో ఈ రహదారిలో ఉన్న స్కూల్‌కు వెళ్లే విద్యార్థులతో పాటు కాలనీల్లోకి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- గతంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌ను కలిసి వెంటనే బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. అధికారులు అప్పటికప్పుడు హడావుడి చేశారు తప్ప పనులు మాత్రం పూర్తి చేయలేదు.
- ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి కాలనీల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జేసీబీ పెట్టి రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించడంతో వర్షా కాలం రాకముందే బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల వారు డిమాండ్ చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి


ఆలయాలు, విద్యాలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో బుధవారం వసంత పంచమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు, పాఠశాలల్లో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల మంత్రోశ్ఛరణల నడుమ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. – ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం

- కర్మన్‌ఘాట్ సరస్వతీ ఉన్నత పాఠశాలలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, నోట్ పుస్తకాలు అందజేశారు. విద్యావేత్త లెక్కల కృష్ణారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ లలితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయంలోని సరస్వతీ అమ్మవారి ఉప ఆలయంలో ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అభిషకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులచే చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మల్లికార్జున దేవస్థానంలో...

ఓల్డ్‌మలక్‌పేటలోని మల్లికార్జున దేవస్థానంలోని జ్ఞాన సరస్వతి మందిరంలో పూజారి కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో పోచమ్మ ఆలయ ప్రతినిధి కామిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ఉత్సవాల


మన్సూరాబాద్: సరస్వతిదేవి అలంకరణలో పోచమ్మ తల్లి

కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ పటేల్, రామచంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో...

సరస్వతీ మాత పుట్టిన రోజు సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా సన్నిధిలో విద్యార్థులచే శ్రీసరస్వతీ పూజ నిర్వహించి చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.ఆలయ చైర్మన్ గుండ మల్లయ్య, వైస్ చైర్మన్ పద్మాకర్ ఆత్రే, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో...

మన్సూరాబాద్ పోచమ్మ ఆలయంలో, నాగోలు డివిజన్ శ్రీసాయినగర్‌లోని దుర్గామాత ఆలయంలో వసంత పంచమిని జరుపుకున్నారు. అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత ఆలయంలో లలితా పారాయణం, కుంకుమార్చన చేసి అమ్మవారికి 108 రకాల నైవేద్యం సమర్పించారు.

శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో గాయత్రి హోమం



సాక్షి, సిటీబ్యూరో: వసంత పంచమి సందర్భంగా బుధవారం సరూర్‌నగర్‌లోని భాగ్యనగర్ విభాగ్ శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో గాయత్రి హోమం, సమూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది పాల్గొనగా.. 25 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అనంతరం 35 మంది చిన్నారుల చేత భగవద్గీత శ్లోకాల పారాయణం నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమాల్లో ముస్లిం చిన్నారి పాల్గొనడం విశేషం. కార్యక్రమాల్లో సరస్వతీ శిశు



మందిర్ హెడ్‌మాస్టర్ సరస్వతీ ఆచార్య, కోశాధికారి ఎన్.నవీన్, కమిటీ సభ్యులు ఎస్.యాదగిరి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న విద్యావేత్త కృష్ణారెడ్డి


కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ ఆలయంలో.. సామూహిక అక్షరాభ్యాసం


దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో...


శ్రీసాయినగర్ దుర్గామాత ఆలయంలో..

శ్రీత్రిశక్తి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

చంపాపేట: బీఎన్‌రెడ్డి డివిజన్ హరిహరపురం కాలనీలోని శ్రీత్రిశక్తి అమ్మవారి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రతేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమానికి స్థానిక డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, రవీందర్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు శంకరయ్యగౌడ్, మురళీకృష్ణ, రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి భూమి పూజ


పూజలో పాల్గొన్న చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ఫేజ్ -1 లో శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి బుధవారం భూమి పూజ చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుబ్బాక శేఖర్, పొన్నాల తిరుమల్, కోస్గి శంకర్, కనకరాజ్, నర్షి రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

కమలానగర్ కాలనీ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులు

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వనస్థలిపురం కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టీవీ రావు, ఉపాధ్యక్షుడిగా ఎం.గణేష్, బి.మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల సుబ్బారావు, సంయుక్త కార్యదర్శులుగా బి.జ్యోతిరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సి.దివాకర్, పుష్పాంజలి, కోశాధికారిగా భరత్ సింగ్, కార్యవర్గ సభ్యులుగా మరికొందరు ఎన్నికయ్యారు.

సింగరేణిలోని స్థలం గుడిసెవాసులదే

సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

సైదాబాద్: సింగరేణి కాలనీలో ముప్పై ఏళ్లుగా నివసిస్తున్న గుడిసెవాసులకే ఇక్కడి స్థలం చెందుతుందని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ సీనియర్ నాయకుడు శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్, పి.చందూనాయక్‌ల ఆధ్వర్యంలో గుడిసెవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ, స్థలం తమకే చెందుతుందని చెప్పుకుంటున్న బోగస్ సొసైటీల తప్పుడు ప్రకటనలకు గుడిసెవాసులు ఆందోళన చెందవద్దని అన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు అందరూ సింగరేణి కాలనీవాసులకు అండగా ఉండాలని ఆయన సూచించారు. సింగరేణి కాలనీ గుడిసెవాసుల సమస్యల పరిష్కరించాలని ఈనెల 17న సైదాబాద్ మండల కార్యాలయం వద్ద శాంతియుత ధర్నా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో కేశవ నాయక్, సద్దాంఖాన్, విక్రం, వంశీ, దశరథ్ నాయక్, విజయ్, బాలునాయక్, హన్మంతు, ఇబ్రహీం, గణేష్, శంకర్, రమాదేవి, సత్యమ్మ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి: సీఐటీయూ


గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు ఆలేటి ఎల్లయ్య తదితరులు

హస్తినాపురం: కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యల పరిష్కారంతో పాటు సామాన్య ప్రజలపై మోపుతున్న పన్నులు, అధిక ధరలను నియంత్రించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. వివిధ డిమాండ్లతో ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మె- గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కమిటీ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన బుధవారం బైరామల్‌గూడలోని వాస్తు మార్బుల్స్ కంపెనీ హమాలీలు గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భూపాల్ మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం 26 వేలుగా నిర్ణయించాలని, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఇంటింటికీ ప్రచారం, సంతకాల సేకరణ జరుగుతోందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లైనా రైతులు, కార్మిక వ్యవసాయ కూలీల సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. కార్యక్రమంలో కృష్ణ, యాదయ్య, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, నరసింహ, నాంపల్లి శ్రీరాములు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

మహేశ్వరం తహసీల్దార్‌గా విజయలక్ష్మి

మహేశ్వరం: మహేశ్వరం మండల నూతన తహసీల్దార్‌గా విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న కొత్త పట్టా పాసు పుస్తకాలు, మ్యూటేషన్ సక్సేషన్‌తో పాటు ఇతర భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.